ప్రార్థనకు గంట కొట్టారు. ఆమె తోట లోంచి బయటకు నడిచింది.

అట్టహాసంగా నవ్వుతో, ప్రేలుతో ఆనందానికి ఆకారాలు కల్పించినట్లు ఒక్కొక్కరు వస్తోన్నారు ప్రార్థనకు. కిటికీ కమ్మల నానుకొని భీభత్సంగా ఉన్న సుందర్రావ్‌ని వేలెట్టి చూపి, నవ్వింది ఓ అమ్మాయి. తోటివాళ్లు పల్లవి పలికారని హెడ్ మిస్ట్రెస్ కింప పెదవి పై పంటితో నొక్కి కళ్ళింత పెద్దవి చేసి చూచిందా పిల్లవేపు.

ప్రార్థనైంది.

సుందర్రావ్ నిశ్చలంగా ఉన్నాడు, సమాధిలో.

అతన్ని చూస్తో వెళ్ళారు ఒక్కొక్కరూ, ప్రార్థన నుంచి. హెడ్ మిస్ట్రెస్ అరుణవేపు చూచింది. నేల చూస్తో నడుస్తుంది అరుణ.

సుందర్రావ్ ఇంకా నుంచో నున్నాడు.

"పదకొండైంది గంట, ఆఫీసుకు పోవూ?" అనే శబ్దం వంట యింటిలోంచి బయలుదేరి సుందర్రావు గదిలోకి ప్రవేశించింది. ఆఫీసు అనే మాట పాశమైబంధించి అతనున్న మరో లోకంలోంచి ఈలోకంలోకి లాక్కువచ్చింది. తానెక్కడున్నాడు? ప్రార్థనైందా? గంట చూచుకున్నాడు. 11-2. ఆల్ రైట్ రాసిన జాబు బయటికితీశాడు. ముక్కలు చేసి గాల్లోకి ఊదాడు.

వాళ్ళమ్మ అతనున్న గదిలోకి వచ్చి "అన్నం పెట్టాను తిందువుగాని రా" అంది.

రాత్రి రాసిన ఫైళ్లు చంకన ఇరికించుకొని బయల్దేరాడు ఆఫీసుకు.

అతని చెవుల్లో "అన్నం పెట్టాను తిందువు గానిరా" అని వినిపిస్తోంది. అతని రక్తంలో "కామినీ హృదయ కావ్యరస పరిగ్రహణంబు నారికేళ పాకము గదా!" అని ధ్వనిస్తోంది.

అతను ఆఫీసుకు వెళ్లాడు.

# వార్తా ప్రసారం

కొప్పర్తి వెంకటేశ్వరశర్మ

ఆవిడ భార్య. ఆయన భర్త. వాళ్లిద్దరూ ప్రేమించుకొని పెళ్ళిచేసుకున్నారో బలవంతానచేయబడ్డారో తెలుసుకుందామని మీకెంతో కుతూహలంగా ఉండొచ్చు. క్షమించండి. ఆ విషయం తెలుసుకునే అదృష్టం నాకు కూడా కలుగలేదు, నాకు తెలిసిందల్లా వాళ్లు ఎనిమిది సంవత్సరాలనుంచి కలిసి ఒకచోట కాపురం చేస్తున్నారని మాత్రమే.

ఒకరోజు ఒక ముసలమ్మ వాళ్ళకు సంబంధించిన ఒక రహస్యాన్ని ఇంటింటికీపోయి రహస్యంగా ప్రసారం చేస్తున్నది. అది నా చెవిని కూడాపడింది. దాన్ని మీచెవిని పోస్తున్నాను.

"చూశారటమ్మా! ఆ శంకరయ్య పెళ్లాం సీతారాం లేదూ, మొగుడి పెట్టిలోంచి ఐదు రూపాయలు దొంగతాళంచెవి పెట్టి తీసిందట!"

"ఎంత సిగ్గులేనిదమ్మా" అని అంతా ముక్కుమీద వేళ్లు వేసుకున్నారు, ఆ అమ్మాయి వాసన తమకు తగలకుండా గాబోలు.

నేనూ సీతారాంని చిన్నప్పటినించీ ఎరుగుదును. ఆ అమ్మాయికిప్పుడు పాతికేళ్లు. మేమిద్దరం కలిసి ఆడుకునే వాళ్ళం చిన్నతనంలో. "కొంచెం కొంచెం ప్రేమ గూడానా?..." అని మీరడగొచ్చు. అహా, అక్షరాలా, కొంచెం ఏం ఖర్మ. హృదయం అంతటితోటీ. వీలయితే మీరుగూడా ప్రేమించండి నిరభ్యంతరంగా.

ఆ ముసలమ్మకు యిప్పుడే తెలిసిందిగాని నాకు చిన్నప్పుడే తెలుసు సీతారాం ఎంత దొంగదైందీ. ఆ విషయానికొస్తే నేను గూడ దొంగవాణ్ణేనంటుంది సీతారాం. మీరు ఆమెనుపోయి కనుక్కోవచ్చు. అది తేల్చుకున్న తర్వాత మీరు తెలుసుకోవలసిన విషయం మేమిద్దరమూ కలిసి దొంగతనాలు చేసే వాళ్ళమని.

ఆచార్లగారి దొడ్లో దానిమ్మకాయలూ, ప్రభలవారబ్బాయి సుద్ద ముక్కలూ,

నాయుడుగారు తాగేసిన సిగరెట్టు పెట్టెలూ, దాని జాంకాయలు నేనూ, నా బొంగరాలు అదీ-కాజేస్తూ ఉండేవాళ్ళం, ఆనం ంకోసం, తన్నులకోసం, విజ్ఞానంకోసం. ఇంతకూ దొంగతనం దానికి నేను నేర్పానో, అది నాకు నేర్పిందో, మా ఇద్దరకూ చలపతి నేర్పాడో తెలుసుకోవాలంటే ఆరోజుల్నడిగి రావల్సిందే.

సీతారాంకు పెళ్ళయినతరువాత ఆ అమ్మాయి దొంగతనం మానేసిందో లేదో తెలీదు. నేను పోయి అడగలేదు. "ఏమో, పెళ్లయిందిగా, మానేసే ఉంటుంది" అని అనుకున్న మాట మాత్రం నిజం. సీతారాంకు పెళ్లయింది గాని నాపెళ్లి కాలేదు. నేను తర్వాత చాలా రోజుల దాకా దొంగతనం చేస్తూవచ్చా. నాన్నకోట్లో చిల్లర డబ్బులూ, దేముడి పెట్లో పటికబెల్లం, తాతయ్య దిండుకింద పొగచుట్టలూ, ఎట్ సెట్రా ఎట్ సెట్రా.

తరువాత నేను కాలేజీకి పోయినాను, చదువుకున్నాను. బి. యస్. సి. అయిపోయింది. కాలేజీలో డెమాన్‌స్ట్రేటర్ని. చౌర్యాన్ని గర్హిస్తాను. ఎవరి జేబుల్లో టెస్టుట్యూబులు బయటికి పోతున్నయో తెలిస్తే నిలేస్తాను. అవి ఎట్లా బయటికి పొయ్యేదీ నాకు తెలుసు. డిమాన్‌స్ట్రేటర్ని! మాటలా?

దొంగతనం చేయటం తప్పు, శుద్ధ తప్పు, ముమ్మాటికీ తప్పు. అందులో పెండ్లయిన ఆడవాళ్లు చేయటం తప్పున్నర. "ఆడవాళ్లు చుట్టలు తాగితే శోభించరు" అన్నాడు బెర్నార్డ్ షా. "దొంగతనం చేసిన ఆడది కూడా శోభించదు" అంటాడు కొ. వెం. శ.

ఐతే ముసలమ్మ అన్నమాటే కొ. వెం. శ. అంటే ఏం శోభిస్తుంది? దాన్ని కొంత మార్పు చేస్తాడు. సీతారాం సైకాలజీని ఎనలైజ్ చేసి, ఆవిడ దొంగతనం చేసే ముందున్న భావ పరంపరలను కొశ్చన్‌మార్కుల ముందుంచటంవల్ల తేలేవి-మల్లెపూల దండలూ, తిలకం సీసాలూ, వెంకటచలందగ్గిర బటానీలూ. మొగుడు ఇడ్డెన్లు తినగాలేంది పెళ్ళాం బటానీలు తినటంలో తప్పులేదు. డబ్బులు పెళ్ళానికి అందనీకుండా పెట్టెలో పెట్టి తాళం వేయటంవల్ల పెళ్ళానికి దొంగతనం చేసే భావం కలిగించిన నాడాయాడు. అతను తాళం వేయకపోతే తాళం పగులకొట్టాల్సినంత అవసరమే ఉండేది కాదు. కాబట్టి, తప్పంతా శం-క-ర-య్యా-దే అని తేల్చేశాను.

దీనికి అమెరికన్ సైకాలజిస్టులూ, స్త్రీల హృదయాంతరాళాల్లో, నరనరాల్లో పెరటి త్రోవన ప్రవేశించటం చాతనయిన రోమియోలూ తమ ఆమోదాన్ని తెలియచేస్తారు.

నాకు శంకరయ్యతో పరిచయం లేదు. అతన్ని చూడకుండానే అతను ఎలావుంటాడో చిత్రించుకున్నా. పెళ్లానికి దమ్మిడీ ఇయ్యడు, డబ్బు పెట్టెలో పెట్టి తాళం వేసుకుంటాడు. ఉత్తపీనాసి, దద్దమ్మ, దేభ్యం, తేభ్యం చాభ్యం.

ఇంకా రెండు విశేషణాలు ఏరి పెడతాడని చలపతిని కలుసుకున్నా. చలపతి మూతి మెలేసి 'ఊఁహుఁ' అన్నాడు. ఇద్దరం శంకరయ్యని వెంటాడి, తరిమి, చుట్టేసి లైబ్రరీలో పట్టుకున్నాం. అతన్ని చూడగానే నాకు ఆశాభంగం అయింది.

ముప్ఫైలోపు. అందంగా, చురుగ్గా ఉన్నాడు. సంస్కారం ఉట్టి పడుతున్నది ముఖంలో. నేను కళ్లెగరేశాను చలపతిని ఉపక్రమించమని. వాడు నన్ను మోచేత్తో పొడిచాడు ధైర్యం చాలటం లేదని.

శంకరయ్యతో పరిచయం అయింది. పరిచయం స్నేహితం అయింది. శంకరయ్య బి. ఏ. పాసయ్యాడు. ఉద్యోగం లేదు. సంపాదన లేదు. ప్రయత్నిస్తూనే ఉన్నాడు పాపం. అతను ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలకూ-బ్రాకెట్ ఆటలో అంకెల గుణింతాలకూ భేదం ఉన్నట్లు అవుపించదు. రెండూ లాటరీ, జూదం. శంకరయ్య ప్రస్తుతం ట్యూషన్లు చెబుతున్నాడు. అడపాదడపా కథలు రాస్తాడు. తల్లినీ పెళ్లాన్నీ పసిదాన్నీ మోస్తున్నాడు, పోషిస్తున్నాడు, ఈదుస్తున్నాడు సంసారం. ఆరోజు సీతారాంకు కావాల్సివచ్చిన ఐదు రూపాయిలూ అతని కొక కథ సంపాదించి పెట్టింది.

ఆముసలమ్మ పేరు "అలిండియా రేడియో." ఆవిడ అవసరం అనుకున్న వార్తల్ని సంగ్రహించి ప్రసారం చేస్తూ ఉంటుంది. అయితే ఆవిడ పుట్టినదగ్గర్నుంచీ ఆవిడ చెప్పినమాటలు

అబద్ధాలని ఎవ్వరూ అనలేకపోయినారు. ఆవిడ ఈమాటలు సంపాదించింది సీతారాం అత్తగారి ద్వారా. సీతారాం ఐదు రూపాయలు తీసిన మాటనిజం. అరణాలుపెట్టి పిల్లకురిబ్బన్లు కొన్న మాట నిజం. కాని ఈ వార్తలుముఖ్యమైనవిగా అవుపించలేదు "అలిండియా రేడియో"కు.

తరువాత ఒకనాటి సాయంత్రపు తాజా వార్త: "ఇది విన్నావుటమ్మోవ్, శంకరయ్య పెళ్ళానికి ఇంగ్లీషు నేర్పుతున్నాట్ట."

"ఇదేం చోద్యం!"

నోటిమీద చెయ్యి వేసుకున్నారు అమ్మలక్కలు.

# శాంసన్-డిలైలా

లవణం

మానవ నాగరికత సర్వ సామాన్యంగా అన్ని దేశాలలోనూ ఒకే మోస్తరుగా పురోగమిస్తుంది. సాధారణంగా శక్తి సామర్థ్యాలలోనూ, తెలివి తేటలలోనూ సమానులే కనుక ఒకర్ని మించి మరొకరు చాలా హెచ్చుగా పురోగమించడం అరుదు. అదే విధంగా ఆయా దేశాల్లో, జాతుల్లో మార్పు తెచ్చిన వారు కూడా సమకాలికులే. అంతేకాదు నైలు, గ్రీకు, మెసపొటేమియా, సింధు, మెక్సికో నాగరికతలన్నీ ఒకే కాలానికి చెందినవి. రష్యాలో లెనిన్, చైనాలో సన్ యేట్ సేన్, అమెరికాలో లింకన్, ఇండియాలో గాంధీ ఒకే యుగానికి చెందినవారు. అలాగే మనకున్న దేవుళ్లలాంటివారే గ్రీకు పురాణాల్లోనూ కానవస్తారు. పండగ పబ్బాలకు సంబంధించిన కథలు సాధారణంగా అందరికీ ఒకటే.

మానవు లందరికీ రాగద్వేషాలు సమానమే కనుక వారివారి వినోదాలు, వైజ్ఞానిక విషయాలు కూడా ఒక్కలాగనే ఉంటాయి. అందుకనే భారత దేశంలో డా॥ కోట్నీస్, ఆద్మీ, హమారా హిందుస్తాన్ (1939) పడోసివంటి చిత్రాలు తయారైన రోజుల్లో అమెరికా మోడ్రన్ టైమ్సు, ముష్యూర్ వెర్డో వంటి చిత్రాలను, ఇంగ్లండు లే-మిజరాబ్లె వంటి చిత్రాలను సమర్పించాయి.

నేడో! జానపద, పౌరాణిక చిత్రాల పేరిట పుక్కిటి పురాణగాథలకు దాసానుదాసులమై పోతూ ఉంటే వారుమాత్రం ఊరుకుంటారా?

మనకున్నవి : బాలనాగమ్మ, గుణసుందరి, పాతాళభైరవి, మాయా రతన్, భీమసేన్, వీర బభ్రువాహన్, భోలాశంకర్ మొదలైన మాయాజాలంతో నిండిన చిత్రాలు. భక్తధృవ, సత్య హరిశ్చంద్ర, వంటి నీతిప్రబోధ చిత్రాలూ లేకపోలేదు. ఆ రెంటినీ సమన్వయపరచి మధ్య మార్గంలో నడచినవీ కద్దు.

అలానే ఒకప్రక్క మాయనీ, మరొక ప్రక్క నీతినీ, ఆదర్శాన్నీ కలిపి సిసిల్-డి-మిల్లీ చిత్రించిన శాంసన్-డిలైలా నేడు భారత ఫిలిం ప్రేక్షకులలో విశేషసంచలనం కలిగిస్తోంది.

బహు వ్యయప్రయాసలతో తీసిన చిత్రమిది. నటన, దర్శకత్వం, కళ, ఛాయ-శబ్దగ్రహణం, కష్టమ్సు మొదలైన వాటి దృష్ట్యా శాంసన్-డిలైలా నేటి చలన చిత్రరంగానికి తలమానికం.

ఈ చిత్రంలో మనకు చూపదలచుకున్నది; నారీప్రేమ పరిశోధనతోనూ, ప్రతీకారముతోనూ కూడుకొన్నదనీ, పురుషశక్తి అనంతమైనదీ, దానిని ఎవరూ జయించలేరనీ. ఈ సిద్ధాంతాన్ని ప్రచారంచేయడానికి ఆధారంగా ఒక పాతగాథను తీసుకున్నారు. మనకు భీముడున్నట్టే వాళ్లకు శాంసన్ తయారైనాడు. మన కృష్ణునిచేత సుదర్శన చక్రమున్నట్టే గాడిద దవడ వారికి దొరికింది. మన రాక్షసుల ప్రాణాలు చెట్టు తొర్రలలోనూ, చిలకలలోనూ ఉన్నట్టే శాంసన్ బలం అతని అందమైన కురులలో ఉంది. కథా విషయం ఇది: శాంసన్‌ను డిలైలా ప్రేమిస్తుంది. కాని డిలైలా సోదరిని ప్రేమిస్తాడు శాంసన్. వివాహసమయాన పోట్లాట